క్లుప్తంగా

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని 3వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బళ్లా సత్యవతి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ నరసమ్మ ఆధ్వర్యంలో నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్లో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార మాసోత్సవం (పోషకాహారలోపం లేని, నిరక్షరాస్యత లేని స్వయంశక్తి గల ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన పోషకాహార వంటకాలను అందజేశారు. కార్యక్రమంలో కంబాలపేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ దేవీ ప్రియాంక, పీఎంపీ వైద్యులు బళ్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అర్హులందరికీ పింఛన్లు


పింఛన్ అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక

రాజమహేంద్రవరం సిటీ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడమే సీఎం జగన్ లక్ష్యమని మాజీ కార్పొరేటర్ గూడూరి రాధిక అన్నారు. స్థానిక 42వ డివిజన్ రత్నంపేటలోని 78వ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గూడూరి రాధిక మాట్లాడుతూ ప్రతినెలా నగర పరిధిలో 28,620 పింఛన్లు అందిస్తుండగా, ఇప్పుడు కొత్తగా మరో 714 మందికి మంజూరయ్యాయన్నారు. ఈ వార్డులో 42 కొత్త పింఛన్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నామన వాసు, వజ్రనాథ్, జాలా నటరాజ్, శ్రీపాద మోహన్, సుంకర హేమంత్ పాల్గొన్నారు.

పేపర్ మిల్లును తరలించండి

ప్రకాశం నగర్: ప్రజలు లేని ప్రదేశానికి పేపర్ మిల్లును తరలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఈ మెయిల్ ద్వారా కోరినట్లు జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు గురువారం ప్రకటనలో తెలిపారు. పేపర్ మిల్లు కాలుష్యం కారణంగా లూథరన్ గిరి, ఆనంద్ నగర్, కోటిలింగాలపేట, మల్లయ్యపేట, కాతేరు ప్రాంతాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిల్లు నుంచి కలుషిత నీరు నేరుగా గోదావరిలోకి వెళ్లడం వలన తాగు నీరు కలుషితమవుతోందన్నారు. కాలుష్య నివారణకు మిల్లు యాజమాన్యం ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదని విమర్శించారు.

బాధితులకు సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న తాడాల చక్రవర్తి

కడియం: కడియపుసావరంలో అగ్ని ప్రమాదానికి గురై నిరాశ్రయులైన మూడు కుటుంబాలకు, వర్షాల వలన ఇంటికప్పు కోల్పోయిన కుటుంబానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి ఆర్థిక సాయం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, ఎంపీటీసీ సాపిరెడ్డి దుర్గా కామేష్ తదితరులు అగ్ని ప్రమాద బాధితుల ఇబ్బందులను చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చక్రవర్తి బాధితులు బొబ్బనపల్లి మరియమ్మ, ముత్యాత్తుల సూర్యనారాయణ, కొల్నాటి సత్తెమ్మ, కె.బుజ్జమ్మ తదితరులకు ఆర్థిక సాయం, నిత్యవసర వస్తువులు అందించారు. అలానే జ్యోతుల అర్జున్, సాపిరెడ్డి రాజు, సాపిరెడ్డి కామేశ్వర్ ఫ్రెండ్ సర్కిల్ ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణు, జ్యోతుల సుధీర్, వరగోగుల ధర్మయ్య, సాపిరెడ్డి బాబీ, సేలం నరసింహ , పల్నాటి అబ్బులు పాల్గొన్నారు.

యువగళం వలంటీర్లకు పరామర్శ

కంబాలచెరువు: భీమవరంలో టీడీపీ నేత నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో అమాయక ప్రజలు, పోలీసులపై యువగళం వలంటీర్లు నిష్కారణ దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. వీరిలో పోలీసులు అరెస్టు చేసి, స్థానిక సెంట్రల్ జైలుకు తరలించిన 29 మంది యువగళం వలంటీర్లను ఆ పార్టీ నేత, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం పరామర్శించారు. వారిని అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. కేసులను ధైర్యంగా ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జవహర్, ఆదిరెడ్డి అప్పారావు తదితరులున్నారు.

కృష్ణం వందే జగద్గురుమ్

- వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- పలుచోట్ల ఉట్టి ఉత్సవం

సీటీఆర్ఐ: నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మార్గాని భరత్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక 2వ వార్డు గోపాల్ నగర్ శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని అక్కడ గోశాలలో గోవులకు పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గోదావరి గట్టుపై గల వేణుగోపాలస్వామి ఆలయం, ఇస్కాన్ మందిరం, దివాన్ చెరువు నేషనల్ హైవే వద్దనున్న శ్రీరాధాకృష్ణ ఆలయంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం మానవాళికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వార్డు ఇన్‌చార్జి మనే దొరబాబు, ప్రసాదుల హరినాథ్, ఎస్‌వీ శ్రీనివాస్, గుర్రం గౌతమ్, బాలమురళి, పి.సత్తిబాబు పాల్గొన్నారు.

అలరించిన వేషధారణ పోటీలు

ఇస్కాన్ మందిరం, ఆర్యాపురంలోని రాధాకృష్ణ మందిరంలోని శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ ఆలయంలో జగన్నాథ, బలరామ, సుభద్ర విగ్రహాలకు విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఉట్టి కొట్టే ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆర్యాపురం శ్రీరాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం 7 గంటలకు ఉట్టి ఉత్సవం,7.30 నుంచి 8.30 వరకు చిన్నారుల బాలకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో


స్వామిని దర్శించుకుంటున్న ఎంపీ భరత్ రామ్

తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ మందిరంలో బాల గోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, ఫల, పుష్పాభిషేకం నిర్వహించారు. రాత్రి 12 గంటలకు 56 రకాల పిండి వంటలతో మహారాజభోగ నివేదన, అనంతరం 108 దీపాలతో రాధాకృష్ణ, గోదావరి మాతకు మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

- దేవీచౌక్ సమీపంలోని దశావతార రామాలయంలో ఆర్ఎల్ గ్రాఫిక్స్, మెమెంటోస్ ఆధ్వర్యంలో బాలకృష్ణుల వేషధారణ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు


దశావతార రామాలయంలో బహుమతుల ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు


బాలకృష్ణునితో రుడా మాజీ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆకుల వెంకటేశ్వరరావు, పుచ్చల రామకృష్ణ, గంతకూర అప్పారావు, గంట్ల వెంకన్న, ఎం.రాజశేఖర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

108 రకాల పిండివంటలతో నైవేద్యం

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలులోని గాయత్రీ నగర్‌లో వైకుంఠపుర దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అహోబిల రామానుజ జీయర్‌స్వామివారి గోష్ఠి ఆధ్వర్యంలో స్వామివారికి 108 రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు.


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


తెప్పోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న రాధాకృష్ణులు

కడియం మండలంలో..

కడియం: బుర్రిలంక వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం వేళ ఉట్టి కొట్టే కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. సీఐ తిలక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

- దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో స్వామికి విశేష పూజలను ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవల్లి ముకుందా (వాసు) ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు జరిపారు. కడియం శ్రీషిర్డిసాయి విద్యానికేతన్, డాఫ్నీ ఏషియాటిక్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బొమ్మలకొలువు, చిన్నారుల నృత్యప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల చైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య పాల్గొన్నారు.


ఆర్యాపురం కృష్ణమందిరంలో..


రాజవోలులో 108 రకాల పిండివంటలతో నైవేద్యం

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- నూతన భవనాలకు ప్రారంభోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కోలమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామసచివాలయం 4, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, గ్రామ సచివాలయం-2, రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయం 1, రైతుభరోసా కేంద్రాల నూతన భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా సుమారు 2వేల మంది ప్రజలకు రూ.40 లక్షలతో ఒక సచివాలయ భవనాన్ని నిర్మించి, 12 మంది సిబ్బందిని నియమించి ప్రజల వద్దకే సేవలు అందజేస్తున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల అవసరాలను తీర్చకుండా, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకునేదన్నారు. టీడీపీ జెండా మోసేవారికే జన్మభూమి కమిటీల ద్వారా పథకాలు అందించారన్నారు. సీఎం జగన్ హయాంలో అర్హులందరికీ


కోలమూరు సచివాలయం-4 నూతన భవనాన్ని ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్

పారదర్శకంగా పథకాలు అందుతున్నాయన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికీ ఆయన నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గెలిపించి, మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం నూతన భవనాల నిర్మాణానికి కృషి చేసిన మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్ కుమార్‌ను చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, పార్టీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉపసర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ తాడేపల్లి గణేశ్వరరావు, పార్టీ నాయకులు పడాల ప్రసాద్, పరిమి దుర్గారావు, పిల్లి సూర్యారావు, మెల్లిమి గాబ్రియేల్, తీటి ప్రసాద్, బాజీ, ఆనందరావు, పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, సుదర్శనరావు,షేక్ చాంద్, ఆనెం శ్రీనివాస్, సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.విజయారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కడియం: మండలంలోని కడియపు సావరం, గుబ్బలూరిపాలెం గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలకు గురువారం బాధ్యత సేవాసంస్థ సాయం అందజేసింది. బాధితులైన బొప్పనపల్లి మరియమ్మ, కోలాటి సత్తమ్మ, ముతబత్తుల సూర్యనారాయణ, సానబోయిన సత్యనారాయణ, సానబోయిన శ్రీను కుటుంబాలకు, అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు పెంకుటింటి పైకప్పు కూలిపోయిన కుక్కల సత్తిబాబు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు గిరజాల బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్ పరామర్శించారు. వారికి నిత్యావసరాలు, బియ్యం, దుప్పట్లు, చీరలు, వంట సామగ్రి, నగదును మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, ఎంపీటీసీ సాపిరెడ్డి దుర్గా కామేష్, మాజీ సర్పంచ్ శీలం వీరయమ్మ, ఉంద్దాడరావు సత్యనారాయణ, పెకెటి పెద్దకాపు అందజేశారు.


బాధితులకు సాయం అందజేస్తున్న గిరజాల బాబు, స్టాలిన్

వాయుకాలుష్య నివారణకు సహకరించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వాయు కాలుష్యాన్ని నివారించడానికి నగరపాలక సంస్థ చేసే కార్యక్రమాలకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కైస్ సందర్భంగా గురువారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కంబాలచెరువు జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దేశంలోనే అతి తక్కువ వాయు కాలుష్య నగరాల్లో రాజమహేంద్రవరం ఒకటన్నారు. ఆ పేరును మనం కాపాడు కోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ హితం కోసం వినాయక చవితికి మట్టి విగ్రహాలు వాడాలన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ పథకంలో వై.జంక్షన్, ఏకేసీ కాలేజీ, శీలం నూకరాజు కంపెనీ రోడ్డు జంక్షన్, ఈట్ స్ట్రీట్ జంక్షన్ల వద్ద ఫౌంటెన్లు, రోడ్డు మార్జిన్లలో పేవర్ బ్లాక్స్ కన్‌స్ట్రక్షన్ డిమోలిషన్ వేస్ట్ క్రషర్స్ మొదలైనవి రూ.8.87 కోట్ల నిధులతో చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ వినూత్న, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో పడకేసిన పారిశుధ్యం


కాటన్ పేటలో పేరుకుపోయిన చెత్త


మూలన పడిన ట్రాక్టర్


నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన బ్యాటరీ వెహికల్స్

- నిద్రావస్థలో పంచాయతీ అధికారులు
- సిబ్బంది ఉన్నా జరగని పనులు

ధవళేశ్వరం: మేజర్ పంచాయతీ ధవళేశ్వరంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. కనీస పర్యవేక్షణ లేక అనేక ప్రాంతాల్లో నిర్వహణ గాడి తప్పింది. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి టెండర్లు ముగిసి ఐదు నెలలు గడిచినా నేటికీ తిరిగి టెండర్లు నిర్వహించకుండా పంచాయతీ అధికారులు కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి మార్చితో పారిశుధ్య నిర్వహణకు టెండర్లు నూతనంగా నిర్వహించాల్సి ఉంది. అయితే నేటికీ అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదు.

కాగితాలకే పరిమితం

సుమారు 90 మంది పారిశుధ్య నిర్వహణ పనులు చేస్తున్నారని అధికారులు చెబుతున్నప్పటికీ అందులో సగం మంది మాత్రమే క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామంలోని ఎర్రకొండ, కాటన్ పేట, కొత్తపేట, రథం వీధి, పోలీస్‌స్టేషన్ వీధి, అగ్రహారం, వాడపేట, జాలరుపేట తదితర ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. గ్రామంలో చెత్త సేకరణ, కాలువల్లో పూడికతీత తదితర పనులు నిర్వహించేందుకు సిబ్బంది సైతం పూర్తి స్థాయిల్లో లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

మూలకు చేరిన ట్రాక్టర్లు

పంచాయతీలోని ట్రాక్టర్లలో రెండు రిపేరుకు వచ్చి మూలన పడ్డాయి. వాటి ఇంజిన్లను పంచాయతీలోని ఒక పక్కన పడేశారు. ఉన్న ట్రాక్టర్లతోనే తూతూమంత్రంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలో రోజు విడిచి రోజు పారిశుధ్య నిర్వహణ పనులు జరుగుతున్నాయి. దీంతో అనేక ప్రాంతాలు కంపు కొడుతున్నాయి. ప్రస్తుతం గ్రామంలో జ్వరాలు కూడా అధికంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బ్యాటరీ వెహికల్స్ సైతం నిర్వహణ లేక మూలకు చేరాయి.

క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ శూన్యం

క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొన్నిచోట్ల మురుగు కాలువల్లో నీరు సైతం రోడ్లపై ప్రవహిస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 60 వేల మంది జనాభా కలిగిన ధవళేశ్వరంలో పారిశుధ్య నిర్వహణపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- నవరత్న పథకాలతో అందరి అభ్యున్నతి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం నవరత్నాలను అమలు జరుపుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో మహాత్మాగాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. స్థానిక శివాలయంలో పూజలు చేశారు. అనంతరం ఎస్సీపేటలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కోటికేశవరం గ్రామాభివృద్ధికి రూ.6.35 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వం కేవలం రూ.39 లక్షలు మాత్రమే కేటాయించిందన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే జగనన్నకు మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ముడే సింధూదివ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, పార్టీ సీనియర్ నాయకులు ములగాడ ఫణికుమార్, ఎంపీటీసీ సభ్యులు నేతల బుజ్జి, యువజన విభాగం మండల కన్వీనర్ ఉల్లి గణ, కోటికేశవరం మాజీ సర్పంచ్ ముండ్రు శ్రీరామ్మూర్తి, ముడే కామేష్ పాల్గొన్నారు.


కోటికేశవరంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మురళీధర్‌కు విజయలక్ష్మి పరామర్శ


గుత్తుల మురళీధర్‌ను పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

కంబాలచెరువు: ఇటీవల అస్వస్థతకు గురై రాజమహేంద్రవరంలోని బొల్లినేని హాస్పిటల్లో చికిత్స పొందుతున్న 50వ వార్డు మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్‌ను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై అక్కడి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందజేయాలన్నారు. ధైర్యంగా ఉండాలని, డాక్టర్లు సూచించిన విధంగా విశ్రాంతి తీసుకుని త్వరగతిన ప్రజా జీవితంలోకి రావాలని మురళీధర్‌కు సూచించారు.

ముంపు నివారణకు శాశ్వత చర్యలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలో ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకుంటున్నట్టు నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. డీలక్స్ సెంటర్, శ్యామలా థియేటర్ జంక్షన్‌లోని ముంపు ప్రాంతాలను గురువారం ఉదయం పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీవర్షాల కారణంగా నగరంలో పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఆ సమస్య పరిష్కారానికి రూ.50 కోట్లతో డ్రైనేజీలు నిర్మించడం జరుగుతుందన్నారు. రూ.7 కోట్లతో షిర్డీసాయి మార్గ్‌లో నిర్మిస్తున్న కాలువ పనులు పూర్తి కావచ్చాయన్నారు. డీలక్స్ సెంటర్, శ్యామల థియేటర్, స్టేడియం రోడ్డులోని కొన్ని వ్యాపార సంస్థలు కాలువలను పూర్తిగా మూసివేస్తూ మెట్లు, ర్యాంపులు నిర్మించాయన్నారు. వాటిని తొలగించి కాలువల్లో సిల్ట్‌ను పూర్తిగా తొలగిస్తున్నామన్నారు. గుండువారివీధి, శ్యామలా థియేటర్, డీలక్స్ సెంటర్, గోదావరి గట్టును ఆనుకున్న రోడ్లలోని కాలువలను ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. అమృత్ పథకంలో నిర్మించిన కాలువలను కలుపుతూ రూ.96 లక్షలతో కాలువలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. శ్యామలా థియేటర్ సెంటర్‌లో కాలువలను ఆధునీకరించడానికి, డ్రైన్లలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు సులువుగా తొలగించడానికి వీలుగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు వేయడానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. త్వరలోనే వాటి పనులు చేపడతామన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రకాశరావు, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


శ్యామలా సెంటర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్

ఆన్‌లైన్‌లో రూ.9.50 లక్షలకు టోకరా

కంబాలచెరువు: పార్ట్ టైం ఉద్యోగం అంటూ వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి, రూ.9.50 లక్షలు పోగొట్టుకున్న సంఘటనపై ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. వివరాల్లోకెళితే.. ప్రకాశం నగర్‌కు చెందిన పి.హరిశంకర్ అనే ఇంజినీర్‌కు ఈనెల మూడో తేదీన ఆన్‌లైన్‌లో ఉద్యోగం అని మెసేజ్ వచ్చింది. దాన్ని క్లిక్ చేయగానే రూ.500 టాస్క్ అంటూ రాగా, ఆ సొమ్మును చెల్లిస్తే రూ.750 జమ అయ్యింది. ఇలా దఫదఫాలుగా సొమ్ములు చెల్లించడం, అధిక మొత్తం రావడం జరిగింది. దీనికి మరింత సొమ్ము వెచ్చించాడు, చివరికి రూ.9.50 లక్షలు జమ చేశాక లావాదేవీలు ఆగిపోయాయి. తర్వాత తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.